
అడల్ట్స్ ఓన్లీ కథ A

# హనీమూన్

శ్రీ ఉదయిని

దాదాపు ఏడాది క్రితం ఓ ఇంగ్లీష్ సినిమాలో స్విట్జర్లాండ్‌లో ఉన్న ఆల్ప్స్ పర్వతాలని సెవంటి యంయంలో చూసి వంశీ ముగ్ధుడయ్యాడు. అక్కడ జరిగే స్కీయింగ్ క్రీడలు, మంచు శిఖరాల మధ్య అంత ఎత్తున తిరిగే కేబుల్ కార్లు రమణీయ ప్రకృతి దృశ్యాలు చూసి ఎంత ఖర్చయినా సరే స్విట్జర్లాండ్‌లోనే హనీమూన్ ప్లాన్ చేసుకోవాలని ఓ నిర్ణయానికి వచ్చాడు. అయితే అతను ఇంకా పెళ్ళి సంబంధాలు చూడటం లేదు. ప్రేమలో కూడా పడలేదు. అలాంటప్పుడు స్విట్జర్లాండ్‌లో హనీమూన్ జరుపుకోవటం గురించి ఊహించటం, ఆ ఊహని పదిలంగా మనసులో దాచేసుకోవటం వరకు పర్వాలేదు కాని ఎవరితోనయినా ప్రస్తావించటం హాస్యాస్పదంగా ఉంటుందేమో అన్న జంకు అతనికి ఉంది. పెళ్ళి చేసుకోమని తల్లిదండ్రులు పోరుతున్నా ఏదో కారణం చెప్పి వాయిదా వేస్తూ వచ్చాడు.



యంబియే చదివిన వంశీ మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. బ్రహ్మచారి జీవితాన్ని జాలీగా గడుపుతూనే పెళ్ళి అయ్యేలోగా తన హనీమూన్ కల నిజం చేసుకునేందుకు కావలసిన రెండు లక్షలు వెనకేయాలి అని నిశ్చయించుకున్నాడు. వడ్డీ ఎక్కువ వస్తుందని బాగా అలవాటయిన బ్యాంక్ నుండి అకౌంట్‌ని కొత్తగా తెరిచిన బ్యాంక్‌కి మార్చాడు. కొన్ని నరదాలకి టాటా చెప్పాడు. ఒకటే ఆశయం!..ఎలాగయినా సరే! అలా స్విట్జర్లాండ్‌లో హనీమూన్ కోసం జాగ్రత్తగా ప్రతి పైసా కూడపెట్టాలి!

ఓ సాయంత్రం ఆఫీస్ నుండి ఆలస్యంగా ఇంటికి బయలుదేరాడు. మధ్యదారిలో అల్లంత దూరంగా తన అకౌంట్‌లో లక్ష రూపాయలు జమ అయిన బ్యాంక్ కనబడింది. తన కలలని సాకారం చేసేందుకు దాని వంతు సాయం ఆ బ్యాంక్ కూడా చేస్తున్నది కదా..ఇంకో ఏడాది వేచి ఉంటే చాలు. అనుకున్నాడు పరవశంగా. అయితే బ్యాంక్ దగ్గరవుతున్న కొద్దీ ఆ బ్యాంక్‌ముందు మూగిఉన్న జనం స్పష్టంగా కనబడి ఆ పరవశం మాయమయింది. బైక్ ఆపాడు.

ఆ బ్యాంక్ దివాలా తీసిందిట. ఇప్పటికయితే అయిదు వేలు డ్రా చేసుకోవటానికి అనుమతిస్తారుట.

వంశీ హతాశుడయ్యాడు. ఆ బ్యాంక్ కోలుకొని తిరిగి మామూలుగా ఎప్పుడు పని చేయటం మొదలు పెడుతుందో చెప్పటం కష్టం. అంతవరకూ అతను దాచుకున్న డబ్బు చేతికి అందదు. అంటే అతని హనీమూన్ కల తీరాలంటే ఏడాది కాదు రెండేళ్ళు ఆగాల్సిరావచ్చు!

అయితే వంశీ పట్టుదల ఇంకా పెరిగింది. ఇలాంటి చిన్న చిన్న అవాంతరాలకి బెదిరితే ఎలా? ఇంకో సంవత్సరం ఎక్కువగా వేచి ఉండాలి. అంతేకదా! ఎన్ని అడ్డంకులు ఎదురయినా సరే స్విట్జర్లాండ్‌లో హనీమూన్ అన్న స్వప్నాన్ని నిజం చేసుకోవాలి అంతే!

టూ పర్సంట్ ఎక్కువ ఇంట్రెస్ట్ వస్తుందని భ్రమ పడితే అసలుకే మోసం వచ్చింది కదా అందుకనే అధిక వడ్డీ గురించి ఆశ పడకుండా ఈసారి ప్రభుత్వరంగ బ్యాంక్‌లో అకౌంట్ తెరిచాడు వంశీ.

అతని అకౌంట్‌లో బ్యాలన్స్ పాతిక వేలు దాటుతున్నప్పుడు అతని జీతం పెరిగిందన్న సంగతి తెలిసి అతను సంబరపడ్డాడు. జీతం పెరిగింది కాబట్టి ఎక్కువ ఆదా చేయచ్చు. అంటే తన కల అనుకున్న సమయం కంటే ఇంకా ముందుగానే నెరవేరే అవకాశం ఉందన్నమాట. ఆ ఉత్సాహంతో బ్యాంక్‌కి వెళ్ళాడు. చిత్రం ఏమిటంటే అతని హనీమూన్ కలని శాశ్వతంగా దెబ్బతీసే సంఘటన అప్పుడే జరిగింది.

మూడు వేలు విత్‌డ్రా చేయాలని చెక్ ఇచ్చి టోకెన్ అందుకున్నాడు. క్యాష్ కౌంటర్ పైన ఉన్న టోకెన్ నెంబర్‌కి తన

నెంబర్‌కి పాతిక తేడా ఉండటంతో చాలా సమయం పదుతుందేమో అనుకున్నాడు...సాధారణంగా ఆ క్యాష్ కౌంటర్‌లో కూర్చునే ముసలాయన చాదస్తంగా ఒకటికి మూడు సార్లు లెక్క పెట్టి టైమ్ తినేస్తాడు మరి. కాని ఆశ్చర్యంగా టోకెన్ నెంబర్లు చకచకా మారసాగాయి.

కౌంటర్‌కి దగ్గరయ్యాక అసలు సంగతి తెలిసింది...అందులో ఉన్నది చాదస్తపు ముసలాయన కాదు. ఓ యువతి! చూడగానే అమాంతం ఆకట్టుకునేంత అందగత్తె కాదు ఆమె. ఆకర్షణీయంగా తయారవటం ఎలాగో తెలిసిన యువతి. అంతేకాదు పనిలో నిమగ్నమయినప్పుడు ఆమె కన

## మెరుపుల తార

**మెరుపుల తార మల్లికా షెరావత్ ఇప్పుడు ధర్మేంద్రతో కలిసి ఓ చిత్రంలో నటిస్తోంది. ఆ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ తయారీలో ఆయనతో కలిసి పనిచేస్తోంది. ఓ పక్క విదేశీ చిత్రాల్లో బిజీగా ఉన్నా బాలీవుడ్‌కే తన ప్రాధాన్యం అంటోంది. 'గరమ్' అని పేరు పెట్టిన ఈ చిత్రం ఆమెకి మంచి బ్రేక్‌నివ్వగలదని భావిస్తున్నారు. అందుకోసమేనేమో ఎలాంటి సీన్స్ పెట్టాలో ధర్మేంద్రతో కలిసి ఆలోచిస్తోంది.**

పరుస్తున్న ఏకాగ్రత వంశీని తల తిప్పుకోనీయలేదు. అరగంట బ్యాంకులో గడపాలి తప్పదు అనుకున్నాడు అతను. ఆమె చక చకా క్యాష్ ఇవ్వటంతో ఎనిమిది నిముషాలలో అతను ఆమె ముందు నిలబడ్డాడు.

ఇవ్వాల్సిన మూడు వేలని ఆమె నాజూకయిన వేళ్ళు నాట్యం చేస్తున్నట్లు చులాగ్గా లెక్క పెట్టటం చూసి ముగ్ధుడయ్యాడు వంశీ.

ఇచ్చిన డబ్బులు సరిచూసుకున్నాక ఆమెని ఇంకోసారి చూడాలనిపించింది. మాట్లాడాలనిపించింది...ఎలా?

అతనికి తటిల్లున ఓ ఆలోచన తట్టింది.

వెంటనే వెనక్కి తిరిగి క్యాష్ కౌంటర్ సమీపించాడు.

తన చేతిలో ఉన్న నోట్ల నుండి ఓ యాభై రూపాయల నోట్ తీసి ఆమెకి అందిస్తూ "మేడమ్! ఓ యాభై ఎక్కువ ఇచ్చారు" అన్నాడు.

ఆమె ఆ నోట్ అందుకుని ఎంతో మధురంగా "థాంక్స్!" అంది ఎవరో కాని అలా డబ్బులు వెనక్కి ఇవ్వరు. అంత మంచి కస్టమర్‌ని గుర్తుపెట్టుకోకపోతే ఎలా అన్నట్లు అతన్నే చూస్తూ నవ్వింది.

ఆ నవ్వు సూటిగా వంశీ గుండెని తాకింది.

ఆ యువతి పేరు సుప్రియ. తను ఎంతో ఎఫిషియెంట్ అని నమ్మకం ఆమెకి. పొరపాటు ఎలా చేశానా అనుకుంది సుప్రియ. ఇతనెవరో కానీ మంచివాడు అనుకుంది.


కంప్యూటర్‌లో అతని వివరాలు చూసి వంశీ అన్న పేరు బాగుందే అనుకుంది.

అయితే సాయంకాలం క్యాష్ సరిచూసుకున్నప్పుడు ఓ యాభై రూపాయలు ఎక్కువ వచ్చాయి. సుప్రియ ఆలోచనలో పడింది.

తరువాత వంశీ అవసరం ఉన్నా లేకపోయినా తరచూ డబ్బులు తీసుకోవటానికి బ్యాంక్‌కి వచ్చేవాడు.

నాలుగయిదుసార్లు డబ్బులు ఎక్కువ వచ్చాయి అని వందనోట్‌లో యాభై నోట్ తిరిగి ఇచ్చాడు వంశీ. ఆ విధంగా తను ఎంతో నిజాయితీ ఉన్న వ్యక్తిగా ఆమె దృష్టిలో పడితే బాగుంటుందని అతని ఊహ.

అతని అంతరంగాన్ని ఇట్టే పసికట్టింది సుప్రియ. అయితే గుంభనంగా ఊరుకుంది. లేదు నేనేమీ పొరపాటు చేయలేదు. మీరే తప్పు లెక్క పెడుతున్నారు అని అతన్ని నిలదీయటం అంత తేలిక కాదని ఆమెకి తోచింది. అలా నిలదీస్తే తను కూడా అల్లరి అయ్యే అవకాశం ఉందని ఆమె భావించింది. ఏం చేయాలి? ఎలా ఇతగాడి నుంచి తప్పించుకోవాలి?



మరుసటిసారి వంశీకి ఇవ్వాల్సిన దానికన్నా రెండు వందలు తక్కువ ఇచ్చింది సుప్రియ. ఇప్పుడు ఏం చేస్తాడు...మేడమ్! మీరు తక్కువ ఇచ్చారు అని అడుగుతాడా?..అనుకుంటూ ఆసక్తిగా ఎదురుచూసింది సుప్రియ.

నోట్లు లెక్క పెట్టుకున్నాక వంశీ ఆమెవంక తిరిగి చిరునవ్వు నవ్వాడు. "మేడమ్! రెండు వందలు ఎక్కువ ఇచ్చారు" అన్నాడు.

సుప్రియ నిర్ఘాంతపోయింది. కౌంటర్‌లో అతను పెట్టిన నోట్లు గాలికి నేల పైన పడ్డా ఆమె కదలకుండా వెళ్ళిపోతున్న వంశీనే చూస్తూ ఉండిపోయింది.

అయితే ఆమె సహోద్యోగి కామెంట్ చేసింది. "అదేమిటి సుప్రియా! నువ్వు అసలు ఎప్పుడూ పొరపాట్లు చేయవు కదా..ఇతని విషయంలో ఇన్నేసిసార్లు ఎక్కువ ఇస్తున్నావు..ఏమిటీ కథా?"

సుప్రియ ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది. ఓహో మమ్మల్ని ఇతరులు కూడా గమనిస్తున్నారన్నమాట అనుకుంది సుప్రియ. ఇతని అల్లరిని ఇక సహించకూడదు అన్న నిర్ణయానికి వచ్చింది.

ఆ తరువాత అతను మళ్ళీ "మేడమ్! ఎక్కువ ఇచ్చారు" అని అన్నప్పుడు సుప్రియ నవ్వుతూ థాంక్స్ చెబుతూనే ఆ నోట్ అందుకుంది. "ఓ పని ఉంది సాయంకాలం ఎదురుగా ఉన్న హోటల్‌కి వస్తారా?" అని రాసుకుని రెడీగా ఉంచుకున్న కాయితాన్ని అతనికి ఇచ్చింది.

హోటల్‌లో వంశీ మెనూ కార్డ్ చూసి ఆమెకి అందిస్తే సుప్రియ అతనికో కవర్ అందించింది.

అందులో అతను అంతవరకూ 'ఎక్కువ ఇచ్చారు..' అంటూ ఆమెకి ఇచ్చిన నోట్లు అన్నీ అతి భద్రంగా ఉన్నాయి.

"చెప్పండి మిస్టర్ వంశీ! ఇదేమన్నా మర్యాదగా ఉందా?" అని నిలదీసింది సుప్రియ.

వంశీ తత్తరపడ్డాడు.

సుప్రియ అంతటితో వదలలేదు. "అసలు మీ ఉద్దేశ్యం ఏమిటి?" అడిగింది.

వంశీ తన హృదయాన్ని ఆమె పాదాల దగ్గర పరిచాడు. "స్వీకరించినా తిరస్కరించినా మీ ఇష్టం!" అన్నాడు.

ఈసారి అతని గొంతులో ధ్వనించిన స్వచ్ఛమయిన నిజాయితీ సుప్రియని అమాంతం కదిలించింది. జెంటిల్మన్‌లాగా కనిపిస్తున్న ఓ మంచి ఉద్యోగస్తుడు అనుకోవటమే కాకుండా డిమాన్‌స్ట్రేట్ చేసి చూపించే సరికి ఆమె కూడా అదే ప్రేమలో నిలువునా మునగాలని అనుకుంది.

ఆమె వదనంలో తెచ్చిపెట్టుకున్న కోపం తొలిగి చిరునవ్వు తొంగిచూడటంతో వంశీ పొంగిపోయాడు.

కాఫీ తాగుతూ తీయని కబుర్లు చెప్పుకున్నారు.

ఆమె ఇచ్చిన కవర్‌లోంచి నోట్ తీసి బిల్‌తోపాటు ప్లేట్‌లో పెట్టాడు వంశీ.

మిగిలిన నోట్లు లెక్క పెట్టాడు. "ఇవేమో మీరు

ఎక్కువ ఇచ్చారని నేను అన్నాను. వీటి మూలంగా అకౌంట్స్ టాలీ అవటం లేదు అంటున్నారు. అలాంటప్పుడు వీటిని ఏం చేయాలో చెప్పండి"

సుప్రియ ఆలోచించింది. "నాకు బోధపడటం లేదు" అంది చివరికి.

"అదీ! ఇప్పుడే నాకో ఆలోచన తట్టింది" ఎప్పుడో వచ్చిన ఆలోచనని అప్పుడే ఆమెకి వివరిస్తూ అన్నాడు వంశీ. "ఈ దబ్బుని మనం ఇద్దరం కలిసి ఖర్చు పెట్టటం సమంజసం"

"అంటే?"

"అంటే ఏమిటంటే రేపు మీకు కూడా సెలవు కదా. ఇద్దరం కలిసి ఓ సినిమా చూద్దాం"

అతని కొంటెతనానికి వస్తున్న నవ్వుని మునిపంట నొక్కి పట్టింది సుప్రియ. "ఇంకా కూడా మిగులుతాయేమో కదా?" అంది.

"యు ఆర్ రైట్! అయితే సినిమా అయ్యాక హోటల్‌కి వెళ్ళాలేమో!" అమాయకంగా అన్నాడు.

"మిస్టర్ వంశీ! ఇంకా దబ్బులు మిగులుతాయని నాకు అనుమానంగా ఉంది.."

"నిజమే సుమా! అయినా మీరేం వర్రీ కావద్దు సుప్రియా! షాపింగ్ చేయచ్చు. ఎగ్జిబిషన్‌కి వెళ్ళచ్చు. ఫిల్మ్ సిటీ చూడచ్చు. నో ప్రాబ్లెం" అన్నాడు వంశీ.

వాళ్ళిద్దరూ కలిసి కవర్‌లో ఉన్న మొత్తాన్నే కాకుండా బ్యాంక్‌లో ఉన్న ఇద్దరి బ్యాలెన్స్ నుండి కూడా దబ్బు వాడి షాపింగ్ చేశారు. ఫిల్మ్‌సిటీ చూశారు. సినిమాలు చూస్తూ కబుర్లు చెప్పుకున్నారు.


సిట్జర్లాండ్ హనీమూన్ దృష్టిలో ఉంచుకుని ఒకసారి వంశీ అన్నాడు. "సుప్రియా! ఇలాగే రెండేళ్ళు జాలీగా ప్రేమించేసుకుని ఆ తరువాత పెళ్లి చేసుకుంటే ఎలా ఉంటుంది?"

అతని చేతిలో ఉన్న తన చేతిని విడిపించుకుంది సుప్రియ. ఆమె మొహంలో కోపం స్పష్టంగా కనబడింది. "వంశీ! డ్రామాలు ఆడాలనుకుంటున్నావా? " సీరియస్‌గా అడిగింది. "పెళ్ళాడాలనే ఉద్దేశ్యం ఉందా లేదా అది చెప్పు"

వంశీ తత్తర పడ్డాడు. "నేను అనేదేమిటంటే ఈలోగా కావలసిన దబ్బులు సమకూర్చుకునే సావకాశం ఉంటుంది అని"

"కావల్సిన దబ్బులా? ఎవరికి? అయినా ఇద్దరం సంపాదిస్తున్నాం కదా..మనకేం సమస్య రాదు" దృఢంగా అంది సుప్రియ.

"అది కాదు సుప్రియా" తడబడుతూ చెప్పబోయాడు వంశీ.



"నేనేం వినను. పెళ్ళికి అన్నేసి రోజులు ఎందుకు ఆగాలి? నువ్వు మా ఇంటికి వచ్చి అడుగుతావా లేకపోతే మా నాన్నగారిని మీ ఇంటికి రమ్మంటావా?" కచ్చితంగా అంది.

వంశీ మనసులోనే లెక్క వేసుకున్నాడు. స్విట్జర్లాండ్ హనీమూన్ కాదు కదా ఊటీకి వెళ్ళటానికి సరిపోయే దబ్బులు లేవు అని సులువుగానే తెలిసిపోయింది.

తండ్రినో మామగారినో హనీమూన్‌కి దబ్బులు అడగటం అతనికి ఇష్టం లేదు. తనకి కుదిరిన బడ్జెట్‌లో అరకు లోయకి వెళ్ళి రావడానికే కొంత అప్పు చేయక తప్పదు అన్న వాస్తవాన్ని అతను తేలికగా తీసుకున్నాడు. సుప్రియతో వివాహం అవటం ముఖ్యం కదా...అందుకనే స్విట్జర్లాండ్‌కి టాటా చెప్పేశాడు.

పెళ్ళి ఇప్పుడే వద్దు అన్న కొడుకు పెళ్ళికి సిద్ధమవటంతో వంశీ తల్లిదండ్రులు సంతోషించారు.

అప్పుడే సంబంధాలు చూడటం మొదలుపెట్టిన సుప్రియ తల్లిదండ్రులు కూడా ఎక్కువ శ్రమ పడకుండా కోరి పెళ్ళి చేసుకుంటాం అని మగపెళ్ళి వారే రావటంతో సంబరపడ్డారు.

హనీమూన్‌లో మొదటి రోజున అరకులో సుప్రియ అడిగింది "వంశీ! నువ్వు ఎవరినన్నా ప్రేమించావా?" అని.

రెండోరోజు సాయంకాలం "అవునూ ఇంతకీ నీ జీతం ఎంత బాబూ?" అని అడిగింది.

మూడోరోజు "నిజం చెప్పు! మందు కొట్టటం, పేకాడటం లాంటి వెధవ వేషాలు వేసే స్నేహితులు ఎవరెవరు ఉన్నారో ఆ లిస్ట్ అంతా బయట పెట్టు" అని నిలదీసింది.

నాలుగో రోజున విశాఖపట్నం బీచ్‌లో చేతిలో చేయి వేసుకుని నడుస్తూ సుప్రియ అడిగింది. "నీ జీవిత ఆశయం ఏమిటి వంశీ?" అని.

అంతవరకూ అన్ని ప్రశ్నలకి అవలీలగానూ క్లుప్తంగానూ సమాధానం ఇచ్చిన వంశీ ఇప్పుడు మాత్రం దేవదాసులాగా దగ్గు అభినయించాడు. "సుప్రియా! నా గుండె లోపలి పొరలలో ఎక్కడో దాక్కుని నన్ను జీవితాంతం కలవరపరిచే సంగతిని ప్రస్తావించావు. ఆ సంగతి నీకు తెలుసా?" అడిగాడు.

"తెలియదు. నీ గుండెలో అన్నేసి పొరలు ఉన్నాయని కూడా తెలియదు. అయినా పొరలతో సహా నీ గుండె గురించి పూర్తి వివరాలు ఈసరికే నువ్వు నాకు చెప్పాల్సిన బాధ్యత నీకు ఉందని నీకు తెలుసా?" ఎదురు ప్రశ్న వేసింది సుప్రియ. "నిన్ను ఏవేవో అడిగాను. కానీ ముందుగానే ఇలాంటి సంగతులు తెలు

## జరిగింది ఇంకొకటి

ముంబైకి చెందిన మోడల్ ఆషిమా భల్లా బాలీవుడ్ కంటే సౌత్ ఇండియా ఫిల్మ్ ఇండస్ట్రీ వారు తనని ఆదరించడం అదృష్టంగా భావిస్తోంది. 'అసలు నేననుకున్నది ఒకటి. జరిగింది ఇంకొకటి. నేను బాలీవుడ్‌లోకి ప్రవేశించి మంచి నటిగా పేరు తెచ్చుకోవాలనుకున్నాను. అయితే విచిత్రంగా బాలీవుడ్ కంటే టాలీవుడ్ నన్ను ఆదరిస్తోంది' అని ఆనందపడుతోంది. ఇంతకుముందే తెలుగులో డాడీ, చెప్పవే చిరుగాలి వంటి చిత్రాల్లో నటించిన ఆషిమా భల్లా ఇప్పుడు తమిళ, కన్నడ చిత్రాల్లో నటించే అవకాశాన్ని చేజిక్కుంచుకంది.

సుకోవాల్సింది. అయినా ఆ పొరలలో ఏం దాగుందో తెలుసుకునే హక్కు నాకు ఉంది కాబట్టి పూర్తి నిజాలు చెబితే మంచిది."

"సరే చెబుతాను. నా జీవిత ఆశయం తీరకపోవటానికి కారణం ఎవరో ముందుగా చెప్పి ఆ తరువాత ఆ ఆశయం కథా కమామీషు చెబుతాను. ఓకే?" అన్నాడు వంశీ.


"ఓకే!" అంది సుప్రియ.

"నా ఆశయ సాధనకి అంత దారుణంగా అడ్డుతగిలిన ఆ వ్యక్తివి నువ్వే సుప్రియా. ఎన్ని కలలు కన్నాను. ఎన్ని స్వప్నాలని ఆ కలలో వీక్షించాను. అవన్నీ కల్లలు అవటానికి కారణం నువ్వే..నువ్వే!"

సుప్రియ తెల్లబోయింది. "ఏమంటున్నావు వంశీ! నా వల్ల నీ కలలు కల్లలయ్యాయా?"

## కలతనిద్ర

**తాము నటించే కొత్త చిత్రాల గురించి తారలు తెగ ఆలోచిస్తారు. ఎలాంటి పాత్ర చేయాలో ముందే తెలుసుకుని దానికి తగినట్టు అభినయించడానికి హోంవర్క్ ప్రారంభిస్తారు. ఇప్పుడు కరీనాకపూర్ కలతనిద్రతో గడుపుతోంది. శ్యామ్ బెనగల్ కొత్తచిత్రంలో మంచి పాత్ర సొంతం చేసుకున్న ఈ భామ ఆ పాత్రని తన కెరీర్‌కి మలుపుగా మలచడానికి తెగ తాపత్రయపడుతోంది. 'చాన్నాళ్ళ నుంచి శ్యామ్ బెనగల్ చిత్రంలో నటించాలన్న కోరిక ఇపుడు తీరబోతోంది' అని ఆనందం వ్యక్తం చేస్తోంది కరీనా.**



వంశీ విజృంభించాడు. "స్విట్జర్లాండ్‌కి హనీమూన్‌కి వెళ్ళటానికి కావాల్సిన డబ్బులు జమ అయ్యేంత వరకూ పెళ్ళి చేసుకోకూడదు అనుకున్నాను. ఆ బ్యాంక్ మూసేయటంతో మొదటి దెబ్బ తగిలింది. అయినా తేరుకున్నాను. బ్యాంక్ మార్చాను. మళ్ళీ నువ్వు తటస్థపడకపోతే నేను ఏదాదిన్నరో రెండేళ్ళో ఓపికగా ఓర్పుగా నిష్ఠగా బుద్ధిగా దృఢ నిశ్చయంతో చలించకుండా బ్రహ్మచారిగా ఉండిపోయి ఆ డబ్బుని సమకూర్చుకునే వాడ్ని. ఆ తర్వాత పెళ్ళి చేసుకుని ఇంచక్కా జంటగా స్విట్జర్లాండ్ వెళ్ళేవాడిని. కానీ..మధ్యలో నువ్వు కనబడ్డావు. నా మనసు పారేసుకున్నాను. స్విట్జర్లాండ్ హనీమూన్‌ని లెక్క పెట్టకుండా ప్రేమలో పడ్డాను. నీ వ్యామోహంలో పడి నా జీవితాశయానికి బై బై చెప్పేశాను. ఇప్పుడు చూడు..ఇలా అరకు వ్యాలీలోనూ విశాఖలోనూ ఎడ్జస్ట్ అవ్వాల్సి వస్తున్నది" నిట్టూర్చినట్లు నటించాడు వంశీ.

సుప్రియ అవాక్కయింది. వంశీని అంతగా ఆకట్టుకున్నానా అన్న ఆలోచనతో ఆమె కొద్దిసేపు మాట్లాడలేకపోయింది. ఎదురుదాడి చేయకపోతే లాభం లేదు అనుకుని తేరుకుంది. "వంశీ నీకు నాణానికి ఒక పక్క మాత్రమే తెలుసు. నేనేమనుకున్నానో తెలుసా. బ్యాంక్ ఆఫీసర్ పరీక్షలు విజయవంతంగా రాసి అప్పుడు పెళ్ళి చేసుకోవాలని అనుకున్నాను. కాని ఏమయింది. మధ్యలో నువ్వు వచ్చి వారానికో నోట్ ఇచ్చి నన్ను నిలువునా మోసం చేశావు. నా సంగతి ఏమిటో చెప్పు..ఇక నేను ఎప్పటికి ఆ పరీక్షలు రాయగలను?"

వంశీ బోలుగా నవ్వాడు. చేతిలో ఉన్న కోన్ ఐస్‌క్రీమ్ చివరి భాగాన్ని నోట్లో ఉంచుకున్నాడు. ఎందుకో అసంతృప్తిగా అనిపించింది. వంశీకి తగురీతిలో జవాబు ఇచ్చి అతన్ని చిత్తు చేశానని పొంగిపోతున్న సుప్రియ చేతిలో సగానికి పైగా ఉన్న ఐస్ క్రీమ్ అతన్ని ఆకర్షించింది. చటుక్కున లాక్కున్నాడు. తినటం మొదలుపెట్టాడు.

సుప్రియ నివ్వెరపోయింది. "ఏయ్! ఏమిటిదీ.." అంది ఎవరన్నా అతని చిలిపి చేష్టని గమనించారా అన్నట్లు అటూ ఇటూ చూసింది. "దిసీజ్ టూ మచ్!"

"అవును టూ మచే ఐ వాంట్ టూ మచ్ అందుకనే తీసుకున్నాను" అన్నాడు వంశీ. "కాపీ కొట్టో పేపర్ లీక్ అయితే తెలుసుకునో నీ పరీక్షలు రాయచ్చు. కాని నా స్విట్జర్లాండ్ సంగతి ఏమిటి? ఆ కల ఎలా నెరవేరుతుంది? నిన్ను చూసిన మరుక్షణం నుండే డబ్బులు పోవటం మొదలయింది. నిన్ను మంచి చేసుకోవాలని ఎక్కువ ఇచ్చారండీ అంటూ వారానికో నోట్ నీకు సమర్పించాను.

ఆ తర్వాత పెళ్ళయ్యేలోగా సరదాగా తిరగాలని ఏవీ ఆలోచించకుండా కళ్ళు మూసుకుని విచ్చలవిడిగా ఖర్చు పెట్టాను. ఇప్పుడు బ్యాలన్స్ నిల్.

రేపో ఎల్లుండో నువ్వు వచ్చి 'వంశీ నేను ఇప్పుడు వట్టిమనిషిని కాదు' అంటావు.

అప్పటినుండి మన అమ్మాయిని స్కూల్లో చేర్పించేందుకు చదివించుకునే డొనేషన్ కూడపెట్టటానికే నేను రెక్కలు ముక్కలు చేసుకోవాల్సి వస్తుంది. ఇక నా స్విట్జర్లాండ్‌ని నేను శాశ్వతంగా మరిచిపోవాల్సిందే కదా"

"వంశీ! నీకు సిగ్గులేదా?" గుసగుసగా అడిగింది సుప్రియ. "ఇది నలుగురూ తిరిగే బీచ్ అని మరిచిపోయావా?"

"నలుగురు తిరగనీ..ముగ్గురు మునగనీ..ఐ డోంట్ కేర్!" మొండిగా అన్నాడు వంశీ. "హే భగవాన్! నా కోరిక ఎలా తీరుతుంది?" ఆకాశం వంక చూశాడు.

పై నుండి వర్షం రూపంలో సమాధానం వచ్చింది. సుప్రియ కిలకిలా నవ్వింది.

"చూడు! చివరికి హనీమూన్‌లో పెళ్ళాంతో బీచ్‌లో హాయిగా తిరిగే అవకాశానికి కూడా నోచుకోని దురదృష్టవంతుడ్ని"

"త్వరగా ఆ షెల్టర్ కిందికి వెడదాం. లేకపోతే హనీమూన్‌లో జలుబు, దగ్గు సంపాదించుకున్న అదృష్టవంతులం అవుతాం!" అంది సుప్రియ.

ఆటోలో తమ కంపెని గెస్ట్ హౌస్‌కి వెడుతూ స్విట్జర్లాండ్ గురించి తను సేకరించిన విశేషాలు ఆమెకి చెప్పాడు వంశీ. "అవన్నీ ఫోటోలతో సహా పిసిలో భద్రంగా ఉంచాను. ఇంటికి వెళ్ళాక చూపిస్తాను."

గెస్ట్ హౌస్‌లో ఇంకో ఆశాభంగం వీళ్ళకోసం ఎదురు చూస్తున్నది.

ఆ రోజు ఉదయం ఆ గెస్ట్ హౌస్‌లో దిగినప్పుడు వాళ్ళిద్దరు తప్ప ఇంక ఎవరూ లేరు. అలా ఏకాంతం దొరుకుతుందనే వంశీ హోటల్‌కన్నా గెస్ట్ హౌస్ బెస్ట్ అనుకున్నాడు.

అయితే వీళ్ళు ఆటో దిగేసరికి గెస్ట్ హౌస్ కిటకిటలాడుతున్నది.

వంశీకి మతిపోయింది. "ఏమిటీ అన్యాయం?" బాయ్‌ని అడిగాడు.

"దేవి దీక్ష పట్టిన భక్తులు సార్! మన కంపెని వాళ్ళే! నలుగురే కదా! రేపు సాయంకాలం వెళ్ళిపోతారు."

రూమ్‌లోకి వచ్చి విరిగిపోయేలాగా బలంగా తలుపు మూశాడు వంశీ. తలుపు అంత బలంగా మూసినా హార్మని, తబలా మొదలయిన వాయిద్యాలని శృతి చేస్తున్న శబ్దం వినబడసాగింది. "చూశావా! మన హనీమూన్ చివరికి ఎలా రూపుదిద్దుకుందో" వంశీ నిస్పృహగా అన్నాడు. "రాత్రంతా వాళ్ళ భజన చేస్తారు కాబోలు!"

వంశీ విసుగ్గా టివి రిమోట్ అందుకుని ఏరి కోరి ఓ అరబ్బీ ఛానెల్ పెట్టి సౌండ్ పెంచాడు. అర్థంకాని భాషలో ఓ మతాచార్యుడు ఏదో ప్రబోధిస్తుంటే ఆయన పొడుగాటి తెల్లటి గెడ్డం ఊగటాన్ని చూస్తూ ఉండిపోయాడు.

"అంత కోపమయితే ఎలా? అయినా ఎందుకా కోపం?" సుప్రియ అడిగింది.

"ఎందుకా?" ఆమెని దగ్గరగా లాక్కున్నాడు వంశీ. "నా హనీమూన్ కల తీరలేదు. బీచ్‌లో ఎక్కువ సేపు ఎంజాయ్ చేయటానికి వీలు లేకుండా వాన ముంచుకు వచ్చింది. ఇప్పుడు చూడు. ప్రశాంతంగా అన్ని గోలలకి

దూరంగా హాయిగా ఉంటుందని ఈ గెస్ట్ హౌస్‌ని సెలక్ట్ చేసుకుంటే ఎవరెవరో దిగిపోయారు. దెబ్బమీద దెబ్బ అంటే ఇదేకదా..! చెప్పు..స్విట్జర్లాండ్‌ని కోల్పోయి నేను ఎక్కువ నష్టపోయానా లేకపోతే ఆ పనికిమాలిన బ్యాంక్ పరీక్షలు రాయకుండా నువ్వు ఎక్కువ కోల్పోయావా?"

"ఆ బ్యాలన్స్ షీట్ తరువాత రాసుకుందాం కాని నేను అర్జంట్‌గా స్నానం చేయాలి. నేను వచ్చేలోగా టేప్‌రికార్డర్‌లో మంచి పాటలు పెట్టు..ఓ.కె."

ఆమె కడిగిన ముత్యంలా తళతళలాడుతూ.. సువాసనలు వెదజల్లుతూ తయారయి వచ్చేసరికి అతను మేరా సుందర్ సప్‌నా భీత్‌గయా అన్న పాట వింటున్నాడు. దిగాలుగా కిటికీలోంచి నల్లటిమబ్బుల వెనకాల దాక్కున్న దిగాంతాల వేపు చూస్తున్నాడు.

సుప్రియ పకపకా నవ్వసాగింది. కుర్చీ వెనకగా నుంచుని అతని భుజాలమీద చేతులు వేసి తల మీద చుబుకం ఆన్చి "బుచ్చిబాబూ! మరీ అంత ఇదయిపోకు" అంది.

చేతులు వెనక్కి సాచి ఆమెని అందుకునేందుకు ప్రయత్నిస్తూ వంశీ అన్నాడు. "ఇదయిపోక నేను చేయగలిగింది ఏముంది?"

"మంచి బాలుడి లాగా స్నానం చేసి రా! అప్పుడు చెబుతాను" అంది అతనికి దూరమవుతూ.

అతను గొణుగుతూనే బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

పది నిముషాల తరువాత ఇద్దరూ డైనింగ్ హాల్ వేపు కదిలారు.

నడుస్తూ వంశీ ఆగిపోయాడు. "ఈ చిత్రం గమనించావా? మనం..తప్ప ఇంకా ఎవరూ లేనట్లు చూడు ఎంత నిశ్శబ్దంగా ఉందో!"

సుప్రియ ఆశ్చర్యపోయింది. "అవును! ఇందాక రాత్రంతా భజన చేస్తారని భయపడ్డాం కదా..ఆ చడీ చప్పుడూ అసలేం లేవు!" అంది.

వంశీకి తెలియదు. కాని సుప్రియలో అద్భుతమయిన నటనా కౌశల్యం ఉంది. ఆశ్చర్యాన్ని మహా గొప్పగా అభినయించింది. పతిదేవుడి కోసం అసలు దేవుడ్ని క్షమించమని ప్రార్థించి ఆ భక్తులతో ఎంచక్కా అబద్ధం చెప్పేసింది. నలుగురు భక్తులకి అన్నవరం సత్యనారాయణ స్వామి దర్శనం చేయిస్తానని మొక్కుకున్నాను. ఈ అయిదు వందలు స్వీకరించి మీరంతా అన్నవరం వెళ్ళి నా మొక్కు తీర్చరూ అని వాళ్ళని అడిగింది.

వంశీ అంత సులువుగానే వాళ్ళూ బుట్టలో పడిపోయి హార్మనీ తబలా సర్దుకుని హడావిడిగా బస్టాండ్‌కి పరుగు తీశారు. ఇదంతా వంశీ స్నానం చేస్తున్నప్పుడు జరిగింది.

"అవునూ..బాయ్ కూడా కనబడదే?" అన్నాడు వంశీ. "మనకి భోజనం ఏర్పాటు చేశాడో లేదో!"

"ఎవరక్కడ?" అంది సుప్రియ జానపద సినిమాలలో లాగా చప్పట్లు చరుస్తూ...సమాధానం రాలేదు. వంశీ కిచెన్‌లోకి తొంగి చూశాడు. "అన్నీ తయారుగా ఉన్నాయి!" అన్నాడు.

"తప్పేదేముంది..మనమే వడ్డించుకుందాం" అంది సుప్రియ.

ఏకాంతం దొరకటంతో వంశీలో మళ్ళీ ఉత్సాహం తొంగిచూసింది. కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేయసాగారు.

"అతనెక్కడికి మాయమయ్యాడో గాని మెచ్చుకోవాలి...వంటకాలు అద్భుతంగా ఉన్నాయి" అన్నాడు వంశీ.

భోజనాలు అయ్యాక ఓపెన్ టెర్రస్‌లో ఓ పక్కగా తడవని చోట కూర్చుని వర్షం ఇంకా ఇంకా తీవ్రం అవటం చూస్తూ ఉండిపోయారు. వర్షం శబ్దం సముద్రం హోరు కలిసి జుగల్‌బందీ ఇస్తున్నాయి. చిక్కని చీకట్లో మెరుస్తున్న నగర దీపాలని చూస్తుంటే ధగధగా కాంతులీనే నక్షత్రాలతో సహా ఆకాశం కింద పడిందా అన్నభ్రాంతి కలుగుతున్నది. అంత అద్భుతమయిన దృశ్యాన్ని రోదసీ నుండి ఎవరో ఫోటో తీస్తున్నారా అన్నట్లు మెరుపుల ఫ్లాష్‌లు వెలువడుతున్నాయి. తామిద్దరూ తప్ప ఇక ప్రపంచంలో ఎవరూ లేరు అన్న భావన కలిగిస్తున్న ఏకాంతాన్ని తనివితీరా అనుభవిస్తూ ఉండిపోయారు.

"బంగాళాఖాతంలో చాలా బలమయిన అల్పపీడనం ఉంది కాబోలు. చాలా రోజులుగా పేపర్లు చదవటం లేదు కదా..బయట ప్రపంచంలో ఏం జరుగుతున్నదో అస్సలు తెలియటం లేదు" అన్నాడు వంశీ.

సుప్రియ మౌనంగా లేచి నుంచుంది. అతని చేయి పట్టుకుని లాగింది. వానజల్లులోకి నడిచింది.

ప్రశ్నలు అడగకుండా లొంగిపోవటంలో మాధుర్యం లభిస్తుందని అతనికి అప్పుడే అవగతమవుతున్నది. అయిదు క్షణాలలో ఇద్దరూ పూర్తిగా తడిసిపోయారు.



"వానలో తడిస్తే జలుబు దగ్గు వస్తాయని సెలవిచ్చావుగా ఇందాక"

సుప్రియ నవ్వింది. "విడి విడిగా ఎవరికి వారే తడిస్తే జలుబు పట్టుకుంటుంది మాస్టారూ..ఇలా జంటగా తడిస్తే ఏ ఇబ్బందీ ఉండదు"

"అబ్బబ్బబ్బ..చలి" అన్నాడు వణకు అభినయిస్తూనే వంశీ "పంచుకుంటే చలి తగ్గకపోగా పెరిగి ఇంకా దగ్గరవమని యాగీ చేస్తుంది తెలుసా?"

"తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాను సారూ!"

"జలుబు దగ్గు సంగతి అటు ఉంచు. ఈ రాసలీలలు ఎవరన్నా చూస్తారేమో?" రసపట్టులో తర్కం కూడదని తెలిసినా అడగకుండా ఉండలేకపోయాడు వంశీ.

అతను స్నానం చేస్తున్నప్పుడు బాయ్‌ని సెకండ్ షోకి వెళ్ళమని డబ్బులు ఇచ్చిన సంగతి చెప్పలేదు సుప్రియ. "పిచ్చీ! ఇందాక నేను ఎవరక్కడ అన్నప్పుడే ఎవరూ లేరని తెలిసిపోయింది కదా!" సుప్రియ నవ్వింది. అతను ముగ్ధుడయ్యేలాగా పరవశించేలాగా స్విట్జర్లాండ్ హనీమూన్‌కి నష్టపరిహారం చెల్లించటానికి ఉద్యుక్తురాలయింది. "స్విట్జర్లాండ్‌లో స్కీయింగ్ చేసినా ఇలా జంటగా చేయలేవు బుచ్చిబాబూ"

"అంతేకాదు.." వంశీకి కొంటె ఆలోచన కలిగింది. ఈదురుగాలి వర్షపు చినుకులు..నల్లటి ఆకాశం..తడిసి పులకరిస్తున్న భూమి..ఏం జరుగుతున్నదో అన్న జిజ్ఞాసని తరచూ ప్రదర్శిస్తున్న మెరుపులూ...ఇలా మొత్తం పంచభూతాలు ఏవీ వినకూడదు అన్నట్లు ఆమెని ఇంకా దగ్గరగా హత్తుకుని చెవిలో రహస్యంగా ఏదో చెప్పాడు వంశీ.

అతన్ని పెనవేసుకుపోయింది సుప్రియ.

☆

## అనుకోని ఇబ్బంది

ఒకసారి సినిమా ఛాన్స్ రావడానికి చాలా కష్టపడాల్సి వస్తున్న టైం ఇది. అయితే వచ్చిన అవకాశాలు ఒకోసారి తారలకి ఎలాంటి ఇబ్బందులు తెచ్చిపెడతాయో తెలుసుకోవాలంటే అర్జెంట్‌గా సుస్మితాసేన్‌ని సంప్రదించాల్సిందే అంటున్నారు సినీజనం. ఎందుకంటే ఆమె ఒకేసారి రెండు సినిమాల్లో నటించడానికి కాల్షీట్లు ఇచ్చి ఇప్పుడు ఇక్కట్లపాలవుతోంది. ఓ దర్శకుడితో గొడవకూడా పడుతోంది. 'అనుకోకుండా ఇలా జరిగింది. మున్ముందు ఇలా జరగకుండా ఉండడానికి ట్రై చేస్తాను' అంటోంది సుస్.